డిటెక్టివ్ స్టోరీ

# భ్రమ

వసుంధర



‘‘నాకు మా అమ్మని చంపేయాలనుంది కవిగారూ!’’ అన్నాడు రంగా.

‘‘ఆఁ’’ అన్నాను ఉలిక్కిపడి.

సాహిత్యాభిలాష ఉంది కానీ నేను కవిత్వం చెప్పలేను. రంగా కూడా కవినన్న ఉద్దేశ్యంతో నన్నలా పిలవలేదు. నేనో ఇన్వెస్టిగేటివ్ ఏజన్సీ నడుపుతున్నాను. రవి కాంచనివి కవి కాంచగలడని తెలుగు నానుడి. అందుకని నా ఏజన్సీకి ‘కవి శోధన’ అని పేరెట్టాను. అలా నేను కవిని. నా పేరు రామకృష్ణ భట్టు కాబట్టి ఎవరిష్టాన్నిబట్టి వాళ్లు నన్ను రామకవి, కృష్ణకవి, రామకృష్ణకవి, భట్టుకవి అని కూడా పిలుస్తూంటారు.

నా శోధనకి మారువేషాలుండవు. పిస్తోళ్లు వాడను. మనసుల లోతుల్లోకెళ్లి రవి కాంచని అంశాలు తెలుసుకుని విశ్లేషించడం నా పద్ధతి. అలా ఎన్నో సమస్యల్ని టాకిల్ చేసానేమో- నాకు చేతినిండా పని.

నాకు అసిస్టెంట్లంటూ ప్రత్యేకంగా లేరు. నా శోధనకి తెలిసినవారి సాయం తీసుకుంటాను. తమ శోధనకి నా విశ్లేషణ ఆసక్తికరంగా ఉండడమేకాక ఎంతోకొంత ప్రతిఫలమూ ఉంటుందని చాలామంది నాకు సాయపడ్డానికి కుతూహల పడతారు.

‘‘నిజంగా నాకు మా అమ్మని చంపేయాలనుంది కవిగారూ!’’ మళ్లీ అన్నాడు రంగా.

పరీక్షగా చూసానతణ్ణి. ఆ మాటనడానికి మనసులో ఎంత వేదన పడ్డాడో- అదంతా ముఖంలో స్పష్టమౌతోంది.

‘‘కన్నకొడుక్కే అలా అనిపించేలా ఏం చేసింది మీ అమ్మ?’’ అడిగాను.

‘‘అమ్మ పేరు మాలతి. తను చాలా మంచిది. అందరమ్మలూ చీరలు, నగలు అంటూ తమ సరదాల గురించి ఆలోచిస్తే తనెప్పుడూ కుటుంబశ్రేయస్సు గురించే ఆలోచించేదని నాన్న మెచ్చుకునేవారు. నాన్నకి దురలవాట్లు లేవు కానీ- ఇల్లు, ఇల్లాలు, పిల్లలు గురించి అంతగా పట్టించుకోడని తాతగారనేవారు. అమ్మ నాన్నని పల్లెత్తు మాటనకుండా, బాధ్యతగా సంసారం నెట్టుకొస్తోందని బామ్మ మెచ్చుకునేది. నాకు చదువబ్బినా, మా చెల్లికి ఇరవై ఏళ్లకే పెళ్లి జరిగినా అమ్మ వ్యవహారదక్షతేనని అంతా అంటారు...’’

‘‘అందుకని అమ్మని చంపేస్తారా?’’ అన్నాను టాపిక్ వేరెటో వెడుతోందని గ్రహించి.

అతడు చురుగ్గా చూసి, ‘‘నన్ను కాస్త చెప్పనివ్వండి...’’ అన్నాడు. ‘‘అమ్మ మంచిదని ఇరుగుపొరుగులూ, ఇంటికొచ్చిన బంధుమిత్రులూ మెచ్చుకుంటారు. దయాగుణంతో ఆదరిస్తుందని బిచ్చగాళ్లూ, మానవత్వంతో చేరదీస్తుందని అభాగ్యులూ మెచ్చుకుంటారు...’’

‘‘మీరొక్కరు మాత్రం ఆమెని చంపాలనుకుంటారు’’ అన్నాను విసుగు నటిస్తూ. నిజానికి నాకు విసుగ్గా ఏం లేదు. టాపిక్ పక్కదారి పట్టకుండా ఎప్పటికప్పుడు జాగ్రత్త.

‘‘నేనొక్కణ్ణే కాదు, గంగా కూడా!’’ ఆగాడు రంగా.

గంగా ఎవరిని నేనడగలేదు. రంగా కొనసాగిస్తాడని నాకు తెలుసు.

గంగాది రంగా వయసే. అతడి తండ్రి తాగుబోతు. తల్లి తిరుగుబోతు. అలాగే ముగ్గురు పిల్లలకి జన్మనిచ్చారు. వాళ్లలో పెద్దవాడు గంగా.

గంగాకి చిన్నప్పుడే సిగరెట్లు అలవాటయ్యాయి. అబద్ధాలు బాగా చెప్పేవాడు. క్లాసులో అల్లరి. పరీక్షల్లో కాపీ. బయట తప్పుడు పనులు. తొమ్మిదేళ్ల వయసుకే చెడినవాడుగా ముద్ర వేయించుకున్నాడు.

తలిదండ్రులు పట్టించుకోని ఆ పిల్లల్ని తమ దగ్గిరుంచుకోవాలని బామ్మ, తాత అనుకున్నారు. కానీ అప్పటికే చెడిపోయిన గంగా ప్రభావం మిగతా ఇద్దరి పిల్లల మీదా పడుతుందని భయం. అతణ్ణి మాలతికి అప్పగిస్తే- మిగతా ఇద్దర్నించీ వేరు చేసినట్లూ ఉంటుంది, క్రమశిక్షణా అలవడుతుందని వాళ్లు ఆశ పడ్డారు. మాలతి వాళ్ల దూరపు బంధువు.

మాలతి గంగా బాధ్యతని అంకితభావంతో స్వీకరించింది. తిట్టి కొట్టి అతడికున్న చెడు అలవాట్లన్నీ మానిపించింది. నీతి, నిజాయితీ, నియమాలపై లెక్చర్లిచ్చి క్రమశిక్షణ నేర్పింది. అతడివల్ల తప్పు జరిగితే కఠినంగా శిక్షించేది.

గంగా మారుతున్నాడని మాలతి అనుకునేది కానీ అతడి అసలు స్వరూపం రంగాకి తెలుసు. అతడు రంగాతో తరచుగా, ‘‘ఏ సినిమా చూడు. హీరోలు నోరిప్పితే బూతులు. ఆడేవి జూదాలు, అబద్ధాలు. చేసేవి దొంగతనాలు, స్మగ్లింగులు. దూరేవి దొమ్మరి గుడిసెలు. తలిదండ్రులు, గురువులు, స్నేహితులు, కమేడియన్ను వగైరాలంతా హీరోలని ఆరాధిస్తారే తప్ప పల్లెత్తు మాట అనరు. హీరోని తప్పు పట్టేవాణ్ణి విలన్ అంటారు. నేను హీరోని. మీ అమ్మ విలన్’’ అనేవాడు.

అప్పట్లో రంగాకి తల్లి అంటే ఆరాధన. గంగా అంటే చిన్న చూపు.

''సినిమాల్లో హీరోలు తమ తప్పు గ్రహించి మారి పోతారు. మా ఆమ్మలాంటి అమ్మ చిన్నప్పట్నించీ ఉంటే ఎంత బాగుండేదో అనుకుని వాపోతారు. నువ్వు నిజంగా హీరోవే ఐతే- చిన్నప్పుడే మా ఇంట్లోకి రావడం నీ అదృష్టం'' అని చెప్పాడతడు.

''మీ ఇల్లు నా అదృష్టం కాదు. అదృష్టానికి వాయిదా. మీ ఇల్లు దాటేకనే నా అసలు అదృష్టం మొదలు. అప్పుడు నేనెక్కడుంటానో నువ్వు చూద్దువు గాని'' అనేవాడు గంగా.

గంగాకి మాలతి అంటే చెప్పలేనంత కోపం. విలాసానికి డబ్బు కావాలంటే- తానివ్వలేదు, గంగాని దొంగతనం చెయ్యనివ్వదు. పరీక్షలో మంచి మార్కులు తెచ్చుకోవాలంటే- తన తెలివి అంతంత మాత్రం, మాలతి కాపీ కొట్టనివ్వదు.

''పెద్దయ్యేక మీ అమ్మమీద పగ తీర్చుకుంటాను'' అనేవాడు గంగా.

''గంగా ఇప్పుడేం చేస్తున్నాడు?'' అడిగాను.

''హైదరాబాదులో రియాల్టరు గంగాధరం పేరు తెలియనివారుండరు'' అన్నాడు రంగా. తెల్లబోయాను.. గంగాధరం రియాల్టరే కాదు, పెద్ద మాఫియా లీడరు కూడా. అతడి పేరు వింటే- మహామహా రాజకీయనాయకులకే టెర్రర్!

''మీరు చెబుతున్నది ఆ గంగాధరం గురించా?'' అని, ''ఇప్పుడర్థమైంది. అతడికి మీ అమ్మగారి మీద పగ. ఆవిణ్ణి చంపడానికి మీ సాయమడిగాడు. ఒప్పుకోకపోతే మాఫియా లెవెల్లో బెదిరించాడు. మీరు డైలమాలో పడ్డారు. ఔనా?'' అన్నాను.

రంగా తల అడ్డంగా ఊపి, ''అమ్మని చంపాలన్న ఆలోచన నాదే- అతడిది కాదు'' అన్నాడు.

''మీరు చెప్పిన ప్రకారం మీ అమ్మ ఉత్తమురాలు. ఆమె సంరక్షణలో పెరిగిన మీరు అమ్మనే చంపాలనుకుంటే- మీలో విలన్ లక్షణాలున్నాయనుకోవాలి''

''అసలు సంగతి తెలిస్తే మీరిలా అనరు'' అన్నాడు రంగా.

రంగా బాగా చదివి ఇంజనీరై సాఫ్ట్‌వేర్ జాబ్ సంపాదించాడు. అంతా అతడి కృషిని మెచ్చుకున్నారు. గంగా బియ్యే మూడో తరగతిలో ప్యాసైతే- అది మాలతి చలవన్నారంతా. ఏదో కంపెనీలో చిన్న ఉద్యోగమొచ్చిందంటూ ఆ ఇంటినుంచి బయటపడ్డాడు గంగా. అదేం ఉద్యోగమో కానీ ఆ తర్వాత మూడేళ్ల లోనే చిన్న రియాల్టరై అంచెలంచెలుగా ఇప్పటి స్థాయి చేరుకున్నాడు.

''గంగా తరచుగా మా ఇంటి





# మీరే డిటెక్టివ్!?

నిర్వహణ: అన్య

## ముత్యాల్లాంటి అక్షరాలు

తొమ్మిది సీట్ల విమానమొకటి నైజీరియా గగన తలం మీద ఎగురుతున్నప్పుడు ఇసుక తుఫానులో చిక్కుకుంది. ఏ క్షణంలోనైనా కూలిపోతుం దేమోనని ప్రాణాలరచేత పట్టుకున్నారు ప్రయాణీకులు. 'టర్బులెన్స్' తట్టుకోలేక పట్టీలు కొట్టిందా లైట్ ఎయిర్ క్రాఫ్ట్.

అంతలో, "అర్జెంట్, కం క్విక్" అన్న ఎయిర్ హోస్టెస్ కేకతో, వెనక వరసలో కూర్చున్న డిటెక్టివ్ లేచి కాక్‌పిట్ వైపు నడిచాడు.

ముందు సీట్లో ఓ వ్యక్తి తలవంచుకుని కూర్చున్నాడు. ఛాతీలో బాకు దిగింది. తెల్లటి షర్టు మీద ఎర్రటి నెత్తురు. ఆ పక్కనే, మరొక్కసీటు దూరంలో కూచుంది ఎయిర్ హోస్టెస్. ఎదురుగా వున్న టేబుల్ మీద అందమైన అక్షరాలు, అంకెలతో ఆమె నింపిన చార్టులు కనిపిస్తున్నాయి.

"నేనివి రాసుకుంటూ కూర్చున్నాను. అయిదు నిమిషాల క్రితం ఎవరో మూలిగినట్టనిపించింది. నేను, అదేమీ పట్టించుకోకుండా, రిపోర్టు ముగించి వెనక్కి తిరిగి చూద్దును కదా, ఆ నాలుగైదు నిమిషాల్లోనే ఈ ఘోరం జరిగిపోయింది" అంటూ కన్నీరు తుడుచుకుంది ఎయిర్ హోస్టెస్.

ప్రయాణీకుల్లోనే ఒకరు హత్య చేశారని తెలుస్తూనే ఉంది. కాని ఎవరు?

మృతుని వెనకసీట్లో వున్న ముగ్గురు వ్యక్తులు నిద్రపోతున్నట్టుగా గుర్రు పెడుతున్నారు. మరో ప్రయాణీకుడు మేజోళ్లు విప్పి, ఫుట్‌రెస్ట్ మీద ఒక కాలూ, పక్క సీటు మీద మరో కాలూ పెట్టి జోగుతున్నాడు.

చివరి సీట్లల్లో ఓ పడుచుజంట కావిలించుకుని కళ్లు మూసుకున్నారు.

విమానం కిందికి దిగింది. పోలీసులు కనిపించగానే, "అరెస్టు చెయ్యండి" అంటూ ఓ వ్యక్తి వైపు వేలు చూపించాడు డిటెక్టివ్. ఎవరా వ్యక్తి?

సమాధానం : విమానం తుఫానులో చిక్కుకుని పట్టీలు కొడుతుంటే ఎయిర్ హోస్టెస్ ముత్యాల్లాంటి అక్షరాలు రాయటం సాధ్యమా?

కొస్తాడు. వచ్చినప్పుడల్లా అమ్మకోసం ఏదో ఒక గిఫ్టు తెస్తాడు. మొదట వెండి పట్టీలిచ్చాడు. తర్వాత బంగారు దుద్దులు. అలా పెంచుతూ పెంచుతూ ఇటీవలే అమ్మకి వడ్డాణం చేయించాడు" ఆగాడు రంగా.

"మరి అమ్మ తీసుకుందా?"

"అమ్మకి నగలంటే మోజు లేదు. వెండి పట్టీలిచ్చినప్పుడే అమ్మ గంగాని తీవ్రంగా మందలించింది. కానీ గంగా వదల్లేదు. 'నేరస్థులైనా భక్తితో కోట్లానుకోట్లు కానుకగా ఇస్తే కాదనకుండా తీసుకుంటున్నాడు తిరుపతి దేవుడు. అది కలియుగ ధర్మం. నువ్వు నన్ను మనిషిని చేసిన దేవతవి. నేను కలియుగ ధర్మాన్ని పాటిస్తున్నాను' అంటూ పాదాలమీద పడిపోయాడు. అమ్మ కాదనలేక పోయింది" అన్నాడు రంగా.

"మరి అతడికి అమ్మమీద పగ అన్నారు?"

రంగా నిట్టూర్చి, "అది పగే మరి! నీతి నిజాయితీల్ని నమ్ముకున్న ఇంజనీర్ని నేనివ్వలేని గిఫ్టులు- అడ్డదార్లనాశ్రయించడం వల్ల చదివింది బియ్యేయే ఐనా తనివ్వగల్గుతున్నాడు. సమాజంలో అమ్మ పెంచిన తనకున్న గౌరవం- అమ్మ కొడుకునైన నాకు లేదని పదేపదే అమ్మకి గుర్తు చేయడమే ఆ గిఫ్టుల అంతరార్థం. ఆ మాట నాకు చెప్పాడు" అన్నాడు.

"అతడలాగన్నాడని మరిమీరు అమ్మకి చెప్పలేదా?"

"చెప్పాను. అమ్మ నవ్వేసి- అంతా నా అనుమానమని కొట్టి పారేసింది"

"అమ్మకి అంతలేసి గిఫ్టులిచ్చిన గంగా మీతో అలా చెప్పాడంటే నమ్మబుద్ధి కావడంలేదు. మీ అమ్మగారన్నట్లు అంతా మీ అనుమానమేనేమో!"

"ఇప్పుడు నేను మిమ్మల్ని కలుసుకుని మాట్లాడుతున్నాను. రేపెవరో ఇది నిజం కాదనీ నా భ్రమనీ అనొచ్చు. వాళ్లమాట నిజమయ్యే అవకాశం ఉంటుందంటారా?" అడిగాడు రంగా.

"ఉంటుంది. భ్రమలకి లోనయ్యే మనిషికి నిజానికీ, అనుమానానికీ తేడా తెలియెకపోవచ్చు. అందుకే- మనం కలుసుకున్న సమయం, మాట్లాడుకున్న విశేషాలు- నోట్ చేసుకుందాం. ఇద్దరివీ టాలీ ఐతే ఇది నిజం. ఎందుకంటే- ఒకే విషయంలో ఇద్దరు ఒకేలా భ్రమపడ్డం అరుదు. ఇంతకీ గంగా మీకా విషయం చెప్పినప్పుడు పక్కన వేరెవరైనా ఉన్నారా?" అన్నాను.

"ఉన్నారు కానీ వాళ్లెవరో, అసలు మా మాటలు విన్నారో లేదో కూడా నాకు తెలియదు"

"అదెలా?"

"రోజూ తెల్లవారుఝామున నాలుగున్నరకి జాగింగుకి వెడతాను నేను. గంగా అక్కడ నాతో కలుస్తాడు. మేమిద్దరం బోలెడు కబుర్లు చెప్పుకుంటాం- పక్కనెవరున్నారో మాకు స్పృహ ఉండదు" అన్నాడు రంగా.

"చిన్న డౌటు. గంగా, మీరూ రోజూ కలుసుకుంటారని అర్థమౌతోంది. అతడు మిమ్మల్ని కలుస్తాడా, మీరతణ్ణి కలుస్తారా? రెండూ ఒకటే అనకుండా బాగా ఆలోచించి చెప్పండి"

"అమ్మకి గంగా పద్ధతులు నచ్చవు. అందుకని నేనూ గంగాకి దూరంగా ఉంటాను. నాకు గంగాని కలుసుకోవడం ఇష్టముండక - జాగింగుకి వెళ్లే ఏరియా మార్చేస్తూంటాను. కానీ ఎలా తెలుసుకుంటాడో- నేనెక్కడికెడితే అక్కడికొస్తాడు. ఒకోసారి జాగింగు మానేయాలనిపిస్తుంది. కానీ డాక్టరు నాకు జాగింగు అవసరమని గట్టిగా చెప్పాడు. అప్పుడప్పుడు నాకనిపిస్తుంది- గంగాయే డాక్టరుచేత అలా చెప్పించాడేమోనని..."

"అంత అవసరమేముంది? అతడు మిమ్మల్ని జాగింగులోనే కలుసుకోవాలని లేదు కదా!"

"అమ్మమీద తనకున్న పగ గురించి నాకొక్కడికే చెబుతాడు కదా- తను నన్ను కలుసుకున్న విషయం అమ్మకి తెలియడం గంగాకి ఇష్టముండదు.."

"అలా మిమ్మల్ని కలుసుకోవడం వల్ల గంగాకి ఏం ప్రయోజనం?"

"అమ్మ కోరికలేమిటో నాకు తెలియకుండా నేనే వాగేలా చేస్తాడు. ఆ కోర్కెలు తీర్చి నా చేతకానితనాన్ని ఎత్తి చూపుతాడు. అందుకు నేను కృంగిపోతుంటే తను పొంగిపోతాడు. కన్న కొడుకుకి మనశ్శాంతి లేకపోతే- ఏ తల్లి సంతోషంగా ఉండగలదు? అదీ అతడి అంతర్యం. అది నా అనుమానం కాదు. జాగింగులో తనే స్వయంగా నాకు చెప్పాడు..."

"అంటే ప్రత్యక్షంగా మీమీదా, పరోక్షంగా మీ అమ్మ మీదా పగ తీర్చుకుంటున్నాడు గంగా. అతడికి మీ కుటుంబ సభ్యుల్లో ఇంకెవరిమీదా పగ లేదా?"

"సమ వయస్కుణ్ణి కదా- అతడి పగంతా నామీదే! అమ్మ చాలా గొప్పదని అతడికి తెలుసు. అలాంటి అమ్మ నాకుందన్న అసూయతో- నన్ను మానసికంగా హింసిస్తున్నాడు. మీరే ఇలాంటి హింసకి గురైతే- ఎలా స్పందిస్తారో చెప్పండి" దీనంగా అన్నాడు రంగా.

"నిజం చెప్పాలంటే- నాకు మీరంటే అసూయగా ఉంది. గంగా మీమీద కాకుండా నామీద పగబడితే బాగుణ్ణనిపిస్తోంది" నవ్వాను.

రంగా అదోలా నావంక చూసి, "థర్డ్ పార్టీ కాబట్టి మీకలా అనిపిస్తోంది. నా స్థానంలో ఉంటే బాధ మీకర్థమౌతుంది" అన్నాడు.

కష్టపడి చదువుకుని వృద్ధిలోకొచ్చాడని ఒకప్పుడు పుట్టినూళ్లో రంగాకి చాలా గౌరవముండేది. చిన్నప్పుడు తను చదివిన స్కూల్లో ఏటా ఓ ఉత్తమ విద్యార్థికి ఐదొందల రూపాయల స్కాలర్‌షిప్ ఏర్పాటు చేస్తే ఊళ్లో గొప్పగా చెప్పుకున్నారు. గుడిలో పూజారికి పాతిక రూపాయలు దక్షిణ వేస్తే ఆయన తనే దేవుడన్నట్లు చూసాడు తనవంక. ఇప్పుడు గంగా పేరిట స్కూల్లో ఏటా పదివేల రూపాయల స్కాలరుషిప్పులు. గుడిలో అతడెప్పుడూ ఐదొందలకి తక్కువగా దక్షిణ వేయడు. ఒకప్పుడు తనని ఆరాధనాభావంతో చూసినవారంతా ఇప్పుడు తనని మనం మనం అంటూ- గంగా గొప్పతనాన్ని పొగడ్డానికి తమతో కలుపుకుంటున్నారు.

"అతగాడిది అన్యాయార్జన. అది అందరికీ తెలుసు. కానీ పైకి చెప్పకపోయినా- ఎలా సంపాదించారన్నదానికంటే- ఎంత సంపాదించారన్నదానికే విలువ. ఊళ్లో పెద్దలైనా, ఇంట్లో అమ్మైనా అదంతే!" అన్నాడు రంగా.

"అమ్మ కూడా అంతే అనుకోను. తనకి నీతి, నిజాయితీ ప్రాణం కదా!" అతడి మాటల అంతరార్థం తెలుసుకుందుకు చురక వేసాను.

"అమ్మకిప్పుడు ఏడు వారాల నగలున్నాయి. బీరువాలో ఓ అరనిండా కొత్త పట్టు చీరలున్నాయి. బయటికెళ్లాలంటే ఓ ఫోన్ కొడితే చాలు- ఏసీ కారుతో డ్రైవర్ని పంపుతాడు గంగా..."

మధ్యలో ఆపి, "మీరింకా కారు కొనలేదా?" అన్నాను.

"కారుంది కానీ డ్రైవర్ని పెట్టుకునే స్తోమత లేదు.." అని- "అమ్మకి నేను యాత్రా స్పెషల్లో టికెట్ కొంటే గంగా మొత్తం మా కుటుంబానికి ఎయిర్ ఫేర్ స్పాన్సర్ చేసాడు. అమ్మ అతడేం చేసినా కాదనకుండా యాక్సెప్ట్ చేసేస్తోంది...."

"మరి మీ అమ్మగారి నీతి, నిజాయితీ గురించి మాట్లాడ్డం మానుకున్నారా?"

"మన సంప్రదాయంలో అన్నింటికీ సంజాయిషీలుంటాయి.." నిట్టూర్చాడు రంగా.

అవినీతిపరుల ఆశలు అనంతం. నీతిపరుల కోర్కెలు పరిమితం. మాలతికి కోట్లకి పడగెత్తాలని లేకపోయినా చిన్న చిన్న కోర్కెలు లేకపోలేదు. నీతిగా ఉండడం వల్ల

అవి తీరడమే గగనమామెకి. అలాంటి పరిస్థితుల్లో ఆ చిన్న కోర్కెలు తీరడానికే అవినీతికి పాల్పడాల్సిన అగత్యం ఏర్పడకుండా భగవంతుడు చేసిన ఏర్పాటు గంగా. రంగాకి అవినీతి పాపం కొంత చుట్టుకున్నా- మాలతికి కానుకలిచ్చిన పుణ్యం కూడా కొంత దక్కుతుంది.

"అమ్మ అలా సరిపెట్టుకుని గంగా చేకూర్చే వైభవం అనుభవిస్తోంది. ఒకప్పుడు అమ్మ సంరక్షణ గంగా అదృష్టమన్నవారందరూ ఇప్పుడు గంగా దొరకడం అమ్మ అదృష్టమంటున్నారు. గంగా కృతజ్ఞతా గుణాన్ని పొగడ్డానికి వెయ్యి నోళ్లు అరువుగా తెచ్చుకుంటున్నవారెందరో! ఇంటికి నేనూ ఎంతో చేస్తున్నాను. గంగా కారణంగా నా చేతలకి విలువే లేకుండా పోయింది"

"గంగాని రోజూ కలుస్తూనే ఉంటారుగా- అతణ్ణి విషయమై నిలదీయాలనిపించలేదా?"

"చాలాసార్లే నిలదీసాను. ఒకొక్కసారి ఒకోలా సమాధానమిచ్చేవాడు. సరిగ్గా నాలుగు రోజులక్రితం- ఓ కొత్త విషయం చెప్పాడు. అతడికి నామీదున్నది పగ కాదుట- జాలి..."

తెల్లబోయాను. ఈ గంగా వ్యవహారమంతా తిరకాసుగా ఉందనిపించింది.

జీవితంలో పైకెదగడానికి తగిన లక్షణాలన్నీ గంగా కంటే ఎక్కువగా ఉన్నాయి రంగాలో. కానీ కన్నతల్లి ఆదర్శాలు అతణ్ణి అణచివేస్తున్నాయి.

"సమాజంలో ప్రతి ఒక్కడూ అవినీతి వల్లనే పైకొస్తున్నాడు. అమ్మకీ అది తెలుసు. తను ఊఁ అంటే- రంగా ఎదుగుదలకి ఆకాశమే హద్దని ఆమెకి తెలుసు. కానీ అంతెత్తు ఎదిగిన కొడుకు తన చెప్పుచేతల్లో ఉంటాడా? తల్లికి కొడుకు ఎదుగుదలకంటే- తన అదుపులో ఉండడమే ప్రధానం. గంగా తన కొడుకు కాదు కాబట్టి అతడేం చేసినా ఏమైనా ఆమె పట్టించుకోదు. నేను పైకి రావాలంటే ఆమె అదుపునుంచి బయటపడాలి. కానీ చిన్నప్పట్నించీ అలవాటైన అదుపు. తప్పడం నావల్ల కాదు. ఆమె బ్రతికుండగా జీవితంలో నేనెదగలేను.."

విషయం నాకు అర్థమైంది. గంగా అతణ్ణి తల్లికి వ్యతిరేకంగా ప్రభావితం చేసాడు. ఎంతలా అంటే- ఆమెను చంపేయాలనేటంత!

తలిదండ్రులు చదవో అని పోరెడుతుంటే- చదవలేక ఆత్మహత్యలు చేసుకున్నవారి గురించి విన్నాను. ఆదర్శాలు వల్లించిందని తల్లినే చంపేయాలనుకునే మనస్తత్వం ఊహలో లేదు నాకు. "ఎంత సంపాదించినా గంగా మనసుకి తృప్తి లేదు. ఒకే తల్లి సంరక్షణలో మీరు ఆదర్శప్రాయంగా తయారయ్యారు. తను పక్కదార్లు పట్టాడు. మిమ్మల్ని తనకంటే ఎక్కువగా పతనం చేయాలని అతడి సంకల్పం. మీ అమ్మగారికి వ్యతిరేకంగా ఆలోచించే ముందు మీరది గ్రహించాలి" అన్నాను.

"చెప్పడం మీకు సులువు. కానీ రేపు గంగా అమ్మకి వజ్రాల నెక్లెస్ తేవచ్చు. అమ్మ అది చూసుకుని మురిసిపోతుంటే- తెలిసినవారందరూ గంగాని మెచ్చుకుంటుంటే- నేను తట్టుకోగలనా? దీనికి అంతం చూడాలి. కానీ నా చేతులతో నేను అమ్మని..." మాట పూర్తి చేయలేక ఆగాడు రంగా.

నాకు తెలుసు. అతడు తల్లిని చంపలేడు. నిజంగా చంపే ఉద్దేశ్యంలో ఉంటే- నా దగ్గిరకొచ్చేవాడు కాదు. తననీ సందిగ్ధంనుంచి బయటపడేసే ఉపాయం నానుంచి కోరుతున్నాడతడు.

"మీ మనోవ్యధ నాకర్థమైంది. దాన్నించి బయటపడాలంటే- మీకున్నది ఒక్కటే మార్గం. అది హత్య!...."

ఆగి అతడివంక చూసాను.

రంగా ముఖం పాలిపోయింది. తను కోరిందే నేను చెప్పానన్న సంతోషం ఏమాత్రమూ కలిగినట్లు లేదతడికి. "నేను హత్యలు చేయగలననే అనుకుంటున్నారా?" అన్నాడు నీరసంగా.

"హత్య చేయడం ఏమంత కష్టం కాదు. మోటివ్ ఉండాలంతే! మీ అమ్మగార్ని చంపడానికి మీరు చెప్పిన మోటివ్ మీ మనసుకే తృప్తి కలిగించలేదు. అందుకే తటపటాయిస్తున్నారు. నేనిప్పుడు మీకు తిరుగులేని మోటివ్ చెబుతాను. వెంటనే హత్యకి ఒప్పుకుంటారు..."

రంగా ముఖంలో ఉత్సాహం లేదు, "చెప్పండి" అన్నాడు. ఆ గొంతులో కుతూహలమూ లేదు.

"ఓ మంచి మనిషికి మనశ్శాంతినివ్వడానికి, ఓ నిజాయితీపరుణ్ణి పతనం నుంచి కాపాడ్డానికి, సమాజానికి పట్టిన ఓ చీడ పురుగు పీడ విరగడ చెయ్యడానికీ- ఓ హత్య చేయలేరా మీరు?"

రంగా ముఖంలో ఆశ్చర్యం, "అంటే- అమ్మని చీడ పురుగు అనుకోమంటారు.." అన్నాడు.

"అమ్మ చీడ పురుగెందుకౌతుంది? నేను చెప్పేది గంగా గురించి.."

రంగా ముఖంలో ఉత్సాహం, "ఎందుకో ఈ ఆలోచన నాకింతవరకూ రాలేదు. బహుశా- గంగాని చంపడం నావల్ల కాదని తెలియడం వల్లనేమో!" అన్నాడు సాలోచనగా.

"గంగాని చంపడం నీవల్లే సులభంగా ఔతుంది. జాగింగులో నీకతడు ఒంటరిగా దొరుకుతాడు. నీమీద అనుమానం లేని గంగాని అవలీలగా చంపేయొచ్చు. మీరిద్దరూ కలుసుకునే విషయం ఎవరికీ తెలియదు కాబట్టి ఎవరికీ నీపై అనుమానం రాదు..."

నా సూచన రంగాకి నచ్చింది. అతడు చటుక్కున లేచి నిలబడి, "నీతికీ నిజాయితీకి ప్రాణమిచ్చేలా పెంచింది నన్ను మా అమ్మ. ఉన్నదానితో తృప్తిపడే మహర్షివంటి నాలో- తల్లినే చంపాలన్న ఆలోచన పుట్టిందంటే- గంగా ఉనికి ఈ సమాజానికి పెద్ద ప్రమాదం. నాకోసమని కాక సమాజ క్షాళనకోసమైనా నేనతణ్ణి చంపేయాలి. నాలో చిత్తశుద్ధి ఉంటే- దేవుడు నాకాశక్తి ఇస్తాడన్న నమ్మకం మీ మాటలు నాలో కలిగించాయి. మీకు నా ధన్యవాదాలు" అన్నాడు.

***

హత్యకి ప్రోత్సహించాలని రంగాకి నేనా సలహా ఇవ్వలేదు. క్రమశిక్షణలో పెరిగిన అతడికి నేరాలు చేసే మనస్తత్వముండదనే నిర్ణయానికొచ్చేకనే నేనలా చెప్పాను. ఈలోగా నా అనుమానాలు నివృత్తి చేసుకుందుకు అతడి గురించి నా పద్ధతిలో కొంత వాకబు చేసాను.

నేననుకున్నది నిజమే!

గంగాకి మాలతి అంటే చెప్పలేనంత గౌరవం. చిన్నప్పుడామె అదుపు చేయడంవల్లనే తను గ్రాడ్యుయేట్ కాగలిగానంటాడతడు. ఆమె గురించి అందరికీ గొప్పగా చెబుతాడు. ఆమె కుటుంబంతో పరిచయం గర్వకారణంగా భావిస్తాడు. బల ప్రతాప వైభవాలకి రావణాసురుడు తపస్సు చేస్తే గంగా అవినీతికి పాల్పడ్డాడు. రావణుడికిలాగే అతడికీ మాతృభక్తి.

లోకకంటకులైన జయవిజయాల ఆగడాల్ని త్వరిత ముక్తిమార్గంగా అభివర్ణించే సంప్రదాయంలో అతడికి ఆరాధకులూ, అభిమానులూ, అనుచరులూ ఉన్నారు. బ్రహ్మ, శివుడు వంటి దేవతల్లా- అతడికి వరాలిచ్చి రక్షిస్తూండే ఇహలోక దేవతలూ ఉన్నారు.



గంగాకి మాలతి కుటుంబం అంటే ఎంతైనా అభిమానముండొచ్చు కానీ రోజూ రంగాతో కలిసి జాగింగు చేసేటంత సమయమతడికి లేదు. అసలతడికి జాగింగుకే సమయం లేదు. చిన్నప్పుడు మాలతి గంగాని అదుపు చేసేది. ఆరంభంలో గంగా ఎంతోకొంత ప్రతిఘటించి ఉంటాడు. అప్పట్లో తన అక్కసు వెళ్ళగ్రక్కడానికి రంగాని ఎన్నుకుని ఉంటాడు. గంగాకి తన తల్లి మీద పగ ఉందన్న భావం అప్పుడే రంగాలో ఏర్పడి క్రమంగా బలపడి ఉంటుంది. క్రమంగా గంగాలో మార్పు వచ్చినా రంగా అభిప్రాయం మారి ఉండదు. కానీ చదువులో తనముందు తీసికట్టుగా ఉన్న గంగాని క్రమంగా పట్టించుకోవడం మానేసాడు. చాలా తొందరగా గంగా తనకందని ఎత్తులకి ఎదిగిపోయేసరికి అతడిలో అసూయ పుట్టింది.

చాటుగా ప్రలోభాలకి లొంగే ఇల్లాలు కూడా సినీ

## తమిళ సినిమాలకి ఇలియానా నో!

తమిళ సినిమాలకి ఇలియానా 'నో' చెబుతోంది. చివరికి రజనీకాంత్ 'సుల్తానా'కు ఇలియానా 'నో' అనేసింది. స్టార్ హీరోయిన్లు సైతం రజనీకాంత్ సినిమా కోసం పోటీపడుతుంటే, ఇలియానా మాత్రం అదో పెద్ద అవకాశం కాదు అన్నట్లు నటించనని తెగేసి చెప్పిందట! టాలీవుడ్, బాలీవుడ్‌లలో బిజీగా ఉండి, డేట్స్ కుదరక 'సుల్తానా' చేయడం లేదని ఇలియానా చెబుతున్నా, అసలు కారణం అది కాదని అంటున్నారు. ఇలియానా దృష్టి అంతా ఇప్పుడు బాలీవుడ్ మీదే ఉందట! ఇద్దరు ముగ్గురు పెద్ద పెద్ద హీరోలు, ఒకటి రెండు పెద్ద పెద్ద సంస్థలు ఇప్పటికే ఇలియానాను సంప్రదించినట్లు సమాచారం. వారు పెద్ద మొత్తంలో పారితోషికాన్ని ఇలియానాకి ఇవ్వ చూపారనీ, ఈ కారణంగానే కోలీవుడ్ ఇలియానా కంటికి ఆనడం లేదని పలువురు అంటున్నారు. ఇదే కనుక నిజమయితే ఇక ఇలియానా టాలీవుడ్‌కి కూడా గుడ్‌బై చెప్పే అవకాశాలు లేకపోలేదు. ప్రస్తుతం బాలీవుడ్‌లో అసిన్ హవా నడుస్తున్న సంగతి తెలిసిందే! ఆ స్థానాన్ని ఇలియానా కైవసం చేసుకోవాలని చూస్తున్నట్లు సమాచారం!

హీరోయిన్ కాలేకపోవడానికి కారణం- తను శీలవతి కావడమేననుకుంటుంది. మేధావి వర్గానికి చెందిన రచయితల్లో కూడా సాటి రచయిత పేరు ప్రతిష్ఠలకి చెంచాగిరీయే కారణమని సరిపెట్టుకునేవారున్నారు.

రంగా మనసులో గంగాతో పోలిక ప్రారంభమైంది. గంగా మార్గాన్ని నిరసిద్దామంటే- తల్లితో సహా అంతా అది సమాజమామోదించిన మార్గంగా నిర్ణయించారు. మన పక్కన మనలాగే మసిలినవాడు ఎమ్మెల్యే ఐన ఏడాదిలో కోట్లకి కోట్లు గడిస్తే అతణ్ణి ప్రజాసేవకుడిగా గుర్తించి, ప్రియతమ నాయకుడిగా ఆరాధించడమే తప్ప ఇంత తక్కువ వ్యవధిలో అంత ఆస్తి ఎలా వచ్చిందని ప్రశ్నించాలని తోచక- అలాంటి చాకచక్యం తమకి లేదని మనసులో విచారిస్తూ- అందుకు కారణం నైతిక విలువలకి తామిచ్చిన ప్రాధాన్యమేనన్న భ్రమలో బ్రతికేవారి సంఖ్య అధికంగా ఉన్న వ్యవస్థ మనది.

రంగా కూడా అలాగే అనుకున్నాడు. తను ఆదర్శాలకి ప్రాధాన్యమివ్వడానికి కారణమైన తల్లిమీదకి మళ్లిందతడి దృష్టి. తన ఉక్రోషం తల్లిమీద ద్వేషంగా మారింది. ఆ ద్వేషం తనలోనే పుట్టిందంటే మనస్కరించక- అందుకూ గంగానే కారణభూతుణ్ణి చేసాడు.

రంగాని జాగింగు చేయమని ఏ డాక్టరూ చెప్పలేదు. తనే డాక్టర్ని సలహా అడిగితే- ఆయన మంచిదే చేయమన్నాడు. ఆ జాగింగులో గంగాని కలుసుకున్నట్లూ, తన మనసులో పుడుతున్న భావాలకు గంగాయే అంకురార్పణ చేస్తున్నట్లూ తనని తాను నమ్మించుకునేవాడు.

ఆ భ్రమ అలా అలా ముదిరి ముదిరి చివరికి తల్లినే చంపేయాలన్న సూచనకి దారి తీసింది. అంతరాంతరాల్లో రంగాకి ఈ విషయం తెలుసు. తన భ్రమ ప్రమాదానికి దారి తీస్తోందని గ్రహించి- దాన్నించి బయటపడ్డానికి నా దగ్గిరకొచ్చాడు.

గంగాని హత్య చేయమని పురికొల్పి నేను తాత్కాలికంగా అతడి ఆలోచనల దారి మళ్లించాను. ఒకసారి ఆ దారినుంచి మళ్లితే అతడు మళ్లీ మామూలు మనిషి కాగలడని నా నమ్మకం.

***

ఆ రోజు తెల్లవారు ఝామున నాలుగున్నరకి మంచి నిద్ర మత్తులో ఉండగా- పక్కలో సెల్ మ్రోగింది. బద్ధకంగా తీసి, ''ఎవరూ?'' అన్నాను.

''రంగా- మీ క్లయంటుని. మీ సలహా ప్రకారం ఇప్పుడే గంగాని చంపేసాను''

ఉలిక్కిపడ్డాను. ఒక్కసారిగా మత్తంతా వదిలిపోయింది.

ఇద్దరూ జాగింగు చేస్తూ ఓ చెట్టుకింద ఆగేరుట. తన మీద అటాక్ జరగొచ్చని ఊహించని గంగా తలని చెట్టుకేసి కొడితే- క్షణాలమీద చచ్చిపోయేట్ట. ఆ సంఘటన ఎవరి కళ్లా పడలేదుట. ఇంటికి వెళ్లేముందు నాకు చెప్పాలనిపించిందిట. వెంటనే ఫోన్ చేసాడు.

''ఓ నిండు ప్రాణాన్ని తీసానన్న పాపభీతి లేదు. తప్పు చేసిన అనుభూతి లేదు. నాకిప్పుడెంతో ప్రశాంతంగా ఉంది. థాంక్స్ ఫర్ యువర్ సజెషన్'' ఫోన్ కట్ చేసాడు.

నా గుండె వేగంగా కొట్టుకుంది.

నేనుకున్నదేమిటి? జరిగిందేమిటి? నిజం చెప్పాలంటే ఈ హత్యకి నేనే బాధ్యుణ్ణి.

జీవితంలో తనకి శిక్షణనిచ్చిన వ్యక్తికి జీవితమంతా ఋణపడి ఉండాలన్న భావంతో విలువైన కానుకలిస్తున్న గంగాతో నాకు స్వయంగా పరిచయమైనా లేదు. అతణ్ణి చంపమని నేను సలహా ఇవ్వడమేమిటి? నిజాయితీ తనకేమిచ్చిందని కుమిలిపోతూ, నీతిపరుణ్ణని భ్రమపడుతూ, అనుక్షణం న్యూనతాభావంతో బాధపడే ఓ సామాన్యుడు అతణ్ణి హత్య చేయడమేమిటి?

అపరాధభావం నన్ను వేధిస్తుంటే నా సోర్సుని అలర్ట్ చేసి గంగా గురించి వాకబు చేయించాను. అతగాడు నాలుగు రోజులుగా ఊళ్లో లేడనీ రేపటికి తిరిగి రావచ్చనీ కబురు తెలిసేకా తేలిగ్గా ఊపిరి పీల్చుకున్నాను. నా సలహా ఎవరికీ ప్రాణాంతకం కాదులే.

ఐనా రంగా గురించి తెలిసి కూడా నేనతడి మాటలు ఎలా నమ్మాను? అతడి జాగింగు భ్రమ. జాగింగులో గంగాని కలవడం భ్రమ. హత్య కూడా భ్రమ అయుండొచ్చని నాకెందుకు స్ఫురించలేదు? అందుకేనేమో- మాయలో పడడానికి జ్ఞానంతో నిమిత్తం లేదని వేదాంతం చెబుతుంది.

ఐతే- ఆ మర్నాడు పేపర్లో చూసిన వార్త నన్ను దిగ్భ్రాంతుణ్ణి చేసింది. హైదరాబాదుకి తిరిగొస్తూ కారు ప్రమాదంలో హఠాన్మరణం చెందాడు గంగా. ప్రమాదం జరిగిన సమయం నిన్న తెల్లవారుఝాము నాలుగున్నర.

అది రంగా చిత్తశుద్ధా? మాలతి దురదృష్టమా? గంగాకి ముక్తి మార్గమూ?

ఏదిఏమైనా గంగా మరణం కాకతాళీయం కావచ్చు కానీ భ్రమ కాదన్న విషయం నాకు మింగుడుపడ్డం లేదు! ☆

చిరునామా:
వసుంధర
శ్రీ వాని గిరిజ నిలయం,
63 సాకెట్ ఫేస్ 1, కాప్రా, ఇసిఐఎల్ పోస్ట్,
హైదరాబాద్- 500 062 (ఏ.పి.)
ఫోన్: 040-27144697

## మనమీదేనర్రోయ్... సరసి..

